క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



మైలవరం: స్థానిక రాజాపేటలో వేంచేసియున్న శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వార్లను రకరకాల పూలమాలలతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అన్నవితరణ కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామివార్లను పూలతో అలంకరించిన రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామాలయ ద్వితీయ వార్షికోత్సవం



తిరువూరు: స్థానిక చీరాల సెంటర్లోని శ్రీకోదండ రామాలయం పునర్నిర్మాణం అనంతరం ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్థసారధి స్వామి వారికి విశేషపూజలు, సేవాకాలం తదితర కార్యక్రమాలను జరిపారు. సీతారాముల శాంతికల్యాణంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సోమవరపు వీరయ్య, సత్యనారాయణ, వికాసతరంగిణి సభ్యులు పర్యవేక్షించారు.

కల్వర్టు ఏర్పాటు చేయాలి



చాట్రాయి: తాగునీటి చెరువుకు పైపు కల్వర్టు లేకపోవడం వలన వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తుమ్మగూడెం పెద్ద చెరువుకు వెళ్లే రోడ్డుపై పైపు కల్వర్టు లేకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గం నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగుతాయి. ఈ కాలువ లోతుగా ఉండడం వలన కారు ఎదుట ఉన్న సంపు, బంపర్లు రోడ్డుకు తగిలి పగిలిపోతున్నాయి. అంతేగాక వరద వచ్చినపుడు వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ మార్గంలో రెండు పైపు కల్వర్టులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోలవరం గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ముల్లంగి యాదయ్యను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఈశ్వరావు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరించండి

నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం వార్డు సచివాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. మంచినీటిని రోజూ సరఫరా చేయడం లేదని, వీధి కుక్కలు, కోతులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, పక్కా డ్రెయినేజీ సదుపాయం లేదని, కాలనీ పక్కనే బైపాస్ రోడ్డు ఉండటం వల్ల అనధికారికంగా భారీ వాహనాలు కాలనీలోని రోడ్లపై తిరుగుతున్నాయని, స్కూల్ బస్సులు సైతం కాలనీలో నుంచే పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఐద్వా నాయకులు నండూరి పద్మాంజలి, ఆకుల పద్మావతి, అనూష, రాజకుమారి, భవాని పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

నందిగామటౌన్(నందిగామరూరల్): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చందాపురం నుంచి డీవీఆర్ కాలనీకి వెళ్లే సర్వీస్ రోడ్డులో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈఘటనలో హనుమంతపాలెంనకు చెందిన గాడిపర్తి రాధాకృష్ణ, పవన్‌సాయి, మరో వాహనంపై ఉన్న అనాసాగరంనకు చెందిన మాదాసు శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని విజయవాడ తరలించారు.

నాడు ఘనం.. నేడు దైన్యం

- నాడు-నేడు పనులపై కూటమి ప్రభుత్వం శీతకన్ను
- అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయరా ?
- ఇలా వదిలేస్తే లక్షలాది రూపాయలు వృథా
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- నాడు-నేడు ఫేజ్-2లో రూ.4.18 కోట్లతో 35 అదనపు తరగతి గదుల నిర్మాణాలు



నూజివీడులోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు



నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ' మనబడి నాడు-నేడు' కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోంది. రూ.కోట్ల నిధులతో ప్రారంభించిన పనులను ఎన్నికల సమయానికి ఉన్నదశలో నిలిపివేయటమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు.

గత ప్రభుత్వ ఉద్దేశం ఇదీ..

నాడు- నేడు రెండో విడతలో భాగంగా నూజివీడు మండలంలోని పలు హైస్కూళ్లలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. తొలి విడతలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల కొరత లేకుండా ఉండేందుకు నాడు- నేడు రెండో విడతలో పలు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టింది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి, చాలినన్ని తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అప్పట్లో శ్రీకారం చుట్టింది.

రూ.4.18 కోట్లు మంజూరు..

నాడు-నేడు ఫేజ్-2లో ప్రభుత్వ పాఠశాలల్లో అదీ ముఖ్యంగా హైస్కూళ్లలో అదనపు గదులను నిర్మించేందుకు నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 35 అదనపు తరగతి గదులను నిర్మాణాన్ని చేపట్టింది. పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో రూ.1.44 కోట్లతో 12 అదనపు తరగతి గదులను, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో రూ.1.08 కోట్లతో 9 అదనపు తరగతి గదులను, గొల్లపల్లి హైస్కూల్‌లో రూ.94 లక్షలతో 8 అదనపు తరగతి గదులను, మీర్జాపురం హైస్కూల్‌లో రూ.72 లక్షలతో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే నాటికి ప్రతి పాఠశాలలో ఈ అదనపు తరగతి గదుల భవనాలు 60 శాతం నుంచి 80 శాతం వరకు నిర్మాణ పనులను పూర్తి చేసుకున్నాయి.

ముందుకు కదలని పనులు..

కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా జెడ్పీ హైస్కూళ్లలో చేపట్టిన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల నాటికి ఏదశలో ఉన్నాయో ఆదశ నుంచి ఇప్పటికీ ముందుకు సాగలేదు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాలను సైతం ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీంతో ఇక్కడ తరగతి గదుల కొరత ఉంది. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయడం ఎంతో అవసరం. అయినప్పటికీ పట్టించుకోకుండా ప్రభుత్వం గాలికొదిలేసింది.

తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తిచేయాలి



హైస్కూళ్లలో తరగతి గదుల కొరతను తీర్చాలి. ఇందుకు నాడు- నేడు ఫేజ్- 2లో ప్రారంభించిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలి. వీటిని 8 నెలలుగా పట్టించుకోకపోవడం దారుణం. ఏ ప్రభుత్వం చేపట్టినా వాటి నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ఉన్నం అనిల్‌కుమార్, ఐసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నూజివీడు

ప్రభుత్వం నుంచి నిర్ణయం రాలేదు..



నూతన ప్రభుత్వం నుంచి నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాల విషయమై ఇంకా ఎలాంటి నిర్ణయం రాలేదు. దాదాపు 50 నుంచి 70 శాతం వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. గొల్లపల్లి హైస్కూల్‌లోని అదనపు తరగతి గదుల భవనానికి తలుపులను బిగించారు.

– ఎం.సేవియా, డీవైఈఓ, నూజివీడు

'ప్రజలను మోసం చేసిన చంద్రబాబు'

నూజివీడు: సూపర్ సిక్స్ పథకాలను వాయిదా వేసి, మద్యం రేట్లు పెంచి ప్రజలను సీఎం చంద్రబాబు నిలువునా మోసం చేశారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం పీఠంపై కూర్చుని ఎనిమిది నెలలు గడిచినా చంద్రబాబు నెరవేర్చకుండా వాయిదాలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ధరలు పెంచడమే సంపద సృష్టించడమా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కంటే చంద్రబాబుకు మద్యం వ్యాపారులకు ఇచ్చే కమీషనే ముఖ్యంగా భావిస్తున్నారని దుయ్యబట్టారు. సమాజంలో పెరుగుతున్న వేధింపులకు, అత్యాచారాలకు, హత్యలకు ప్రధాన కారణం మద్యం అని పలు నివేదికలు చెబుతున్నా, ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తూ ఖజానా నింపుకోవడానికి ప్రాధాన్యతనివ్వడం సిగ్గుచేటన్నారు. మద్యాన్ని డోర్ డెలివరీ చేసే స్థాయికి కూటమి ప్రభుత్వ హయాంలో పరిస్థితులు దిగజారాయని, మద్య నిషేధానికి మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ఉద్యమించాలని హరినాథ్ విజ్ఞప్తి చేశారు.

ఆలయ వార్షికోత్సవం

గోపవరం (ముసునూరు): గోపవరం శివారు నాగేంద్రపురంలోని సుప్రసిద్ధ, మహిమాన్విత ప్రత్యక్ష నాగేంద్ర స్వామి గర్భాలయంలోని మూలవిరాట్ స్వరూపాలకు తెల్లవారు జామున అర్చకులు పల్లం చిట్టిబాబు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. బుధవారం స్వామివారి ఆలయ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ కౌలుదార్లకే ఇవ్వాలి

తిరువూరు: కౌలురైతులకే ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని కౌలురైతుల సంఘ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట కౌలురైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కోరుతూ ధర్నా నిర్వహించారు. భూయజమానితో సంబంధం లేకుండా సాగుచేసే కౌలురైతులకే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని డేవిడ్ పేర్కొన్నారు. సాగు గిట్టుబాటు కాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతులకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలుదారుల సమస్యలపై తిరువూరు తహసీల్దారు లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్,ఏఐవైఎఫ్ నేతలు సుబానీ, యాసిన్, బాణాల అశోక్, ముత్తయ్య, కన్నయ్య, పల్లపు మురళి, రామారావు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న డేవిడ్ తదితరులు

సహిత విద్యకు ప్రోత్సాహం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): దివ్యాంగుల చిన్నారులకు సంక్షేమ ఫలాలు నూరు శాతం అందించేందుకు ప్రభుత్వం సహిత విద్యను ప్రోత్సహిస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ.సుబ్బారావు తెలిపారు. గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణలో జరిగిన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సామాజికంగా దివ్యాంగుల గుర్తింపు సర్వేలో ఉపాధ్యాయులు పాటించాల్సిన విధి విధానాలు వివరించారు. పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగులకు ఆర్థిక సహాయ సహకారాలు, స్కాలర్‌షిప్‌లు వారికి చేరేవరకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.ఉమామహేశ్వరరావు, ఆస్పిరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్లు మోహన్‌సందీప్, వనజ, ఎంఈవో సీహెచ్ పుష్పలత, ఎంఈవో- 2 రత్న శ్యామ్‌బాబు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఈవో యూవీ సుబ్బారావు, తదితరులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

చాట్రాయి: షరతులు లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగం సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో కౌలు రైతుల సంఖ్య పెరుగుతుందని, కౌలు రైతులకు గుర్తింపు కార్డు కావాలంటూ భూ యజమాని సంతకం పెట్టడం లేదని ఆయన అన్నారు. ఈ నిబంధనను సడలించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా కౌలు రైతు అన్నపురెడ్డి అనూషా, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆనందం

విద్యార్థులకు సామాజిక బాధ్యత నేర్పాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యార్థులకు సామాజిక బాధ్యత నేర్పించాలని ఎస్ఐ ఫణీంద్ర తెలిపారు. కొండపల్లి రవీంద్రభారతి పాఠశాలలో యూకేజీ విద్యార్థుల కాన్వకేషన్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి సాంస్కృతిక, క్రీడా పోటీలు అలవర్చుకోవాలన్నారు. యూకేజీ నుంచి ఒకటో తరగతికి వచ్చే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం కొడాలి నాగమల్లేశ్వరి, పాఠశాల సిబ్బంది పసుపులేటి చైతన్య, శ్రీలత, క్యాంపస్ ఇన్‌చార్జి భూషణం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొండపల్లి రవీంద్రభారతిలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

బాస్కెట్ బాల్‌లో కృష్ణా జట్టుకు ద్వితీయ స్థానం



ద్వితీయ స్థానంలో నిలిచిన బాల బాలికల జట్లు

నూజివీడు: పిఠాపురంలో ఈ నెల 8 నుంచి 11 వరకు నిర్వహించిన 8వ ఆంధ్రప్రదేశ్ యూత్ బాస్కెట్‌బాల్ అంతర జిల్లా బాలుర, బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా బాలుర, బాలికల జట్లు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కోచ్ వాకా నాగరాజు బుధవారం తెలిపారు. కృష్ణా బాలుర, బాలికల జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి బాలుర, బాలికల జట్లపై తలపడి ఓడిపోవడంతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులను కోచ్, పలువురు క్రీడాకారులు అభినందించారు.

లోపాలు లేకుండా భూ రీసర్వే చేపట్టాలి

సబ్ కలెక్టర్ కావూరి చైతన్య

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): లోపాలు లేకుండా భూముల రీ సర్వే చేపట్టాలని విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని కేతనకొండ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను బుధవారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూములు సర్వే చేసే సమయంలో తప్పనిసరిగా రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జగ్రత్తలు వహించాలని ఆదేశించారు. సర్వేలో ఇబ్బందులపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మండలంలో సర్వే చేస్తున్న బృందాల వివరాలపై ఆరా తీశారు. సర్వేలో మండల తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, సర్వేయర్ భాను, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు రైతు రిజిస్ట్రీ విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీనిలో రైతులు తమకు చెందిన భూముల వివరాలను నమోదు చేయించుకొని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని ఏడీఏ జి.విద్యాసాగర్ పేర్కొన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు, మొర్సపూడిలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి తమ భూమి వివరాలను నమోదు చేయించుకొని విశిష్ట నంబరును పొందాలన్నారు. రాబోయే కాలంలో కౌలు రైతులకు, రైతు కూలీలకు సైతం ఈ పద్ధతిని ప్రవేశపెడతారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భూమి కలిగిన ప్రతి రైతూ తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను పొందాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వీహెచ్ఏ, వీఏఏలు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రభుత్వ పథకాల లబ్ధికి కేంద్ర ప్రభుత్వ విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని ఎంఏవో కె.చినసూరిబాబు సూచించారు. మండలంలోని చింతలవల్లి, లోపూడి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను రైతులు తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని పంటల సమగ్ర సస్య రక్షణకు అవసరమైన వివరాలను తెలుసుకోవాలన్నారు. ఏఈఓ రామకృష్ణ నాయక్ వీహెచ్ఏలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరు పాల్గొన్నారు.

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పీ పద్మ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. ఉద్యాన అధికారి సోహిల్ అహ్మద్, ఏఎస్‌వో అక్బర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

నేరగాళ్ల కోసం వాహనాల తనిఖీ

తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలోని ఎర్రుపాలెం మండలం నారాయణపురం, వైరా గ్రామాలలో జరిగిన చోరీ సంఘటనల్లో నిందితుల కోసం ఆ రాష్ట్ర పోలీసుల సూచన మేరకు తిరువూరులో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఒక ద్విచక్రవాహనం, మరో కారులో సంచరిస్తూ దోపిడీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీకై లక్ష్మీపురం వద్ద అనుమానితులను ప్రశ్నించారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

ఇంజినీరింగ్ విద్యార్థులకు సదస్సు

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీటెక్ ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థులకు 'సమస్య పరిష్కార దృక్పథం రూపకల్పన' పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పీవీపీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు ఎం.రఘు, లక్ష్మీకాంత్‌లు విద్యార్థులకు పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర బాబు, అధ్యాపకులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పొలం బాట



క్షేత్ర సందర్శనలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

మైలవరం: చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, అందుకు క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం 'పొలం బాట' కార్యక్రమంలో జి.కొండూరు మండలం కుంటముక్కలలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పంటల సాగు, దిగుబడులు, అమ్మకాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక శిల్పారామంలో శిలల పుట్టుక, శిల్పాకృతి పొందే విధానం, పనిముట్లు, రవాణా గురించి శిల్పిని అడిగి తెలుసుకున్నారు. శ్రమ జీవన అధ్యయనంలో భాగంగా స్థానికంగా ఉన్న బ్రిక్స్ తయారీ యూనిట్‌ను సందర్శించి సందేహాలు తీర్చుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు సేకరించి శుభ్రం చేశారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, అక్షరాస్యతను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ మెండా దేవానంద్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలి



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు బాలాజీ కుమార్, సుభానీ తదితరులు

మైలవరం: రైతులు డ్రిప్, తుంపర సేద్యంపై ప్రభుత్వ రాయితీలు ఉపయోగించుకుని తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించాలని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ పీఎం సుభానీ తెలిపారు. మండలంలోని చంద్రాల, గణపవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పామాయిల్ మొక్కలలో అంతర పంటలు పండించాలని సూచించారు. గణపవరం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులను రైతు సేవా కేంద్రానికి తీసుకువచ్చి వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న, మామిడి తోటలు పరిశీలించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి పీ బాలాజీ కుమార్ మాట్లాడుతూ మామిడిపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. చంద్రాల గ్రామంలో సమాచార హక్కు చట్టం- 2005పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా ఎటువంటి సమాచారం కావలసినా ప్రభుత్వ కార్యాలయాల నుంచి పొందవచ్చని తెలిపారు. రైతులు అడిగిన సమాచారం 5 నుంచి 30 రోజులలో పొందొచ్చన్నారు. మైలవరం ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, ఏఓ టెక్నికల్ ఆర్.వాసుదేవ్, ఎంఏఓ రే.సంధ్యారాణి, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు. పొలం కలిగిన ప్రతి రైతు, రైతు సేవా కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకుని ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందవచ్చని సూచించారు.

నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులకు పంటల సాగుపై ఎంఏఓ రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సాగు పద్ధతులపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.

వేంకటాచలస్వామి ఎదుర్కోలు ఉత్సవం



తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి తిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి జైబావి సెంటరులోని కొఠాయి మండపం వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలకృష్ణమాచార్యులు, దివి ఉదయకుమారాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు సంప్రదాయబద్ధంగా వేంకటాచలస్వామికి ఎదుర్కోలు నిర్వహించి కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునఃప్రారంభించాలి

తిరువూరు: రాష్ట్రంలో గతంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ రాజు కోరారు. గంపలగూడెం మండలం నెమలిలో సంఘ మండల సమావేశం బుధవారం జరిగింది. పేద బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా గతంలో వలె రుణాలు, ఇతర పథకాలను అమలు చేయాలని కోరారు. హైదరాబాదు చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్‌పై దాడిని సమావేశంలో ఖండించారు. సంఘసభ్యులు కావూరి చిరంజీవి, గోపాలాచార్యులు, భాస్కరాచార్యులు, రామాచార్యులు, ఈమని సురేష్‌శర్మ, శ్యాంప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.